ప్రభుత్వ దవాఖానలో ప్రసవాలు జరిగేలా చూడాలి

నవాబుపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని సందర్శించిన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

నవాబుపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న పనులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

నవాబుపేట, నవంబర్ 19 : ప్రభుత్వ దవాఖానలో ప్రసవాలు జరిగేలా కృషిచేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం నవాబుపేట మండల పర్యటనలో భాగంగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేపడుతున్న పనులు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థుల సమస్యలపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అంటుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలను అందించాలన్నారు. గర్భిణులను వేరే దవాఖానలకు పంపించకుండా స్థానిక దవాఖానలోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో చేపడుతున్న మరమ్మతులు డిసెంబర్ 25లోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనులు చేపట్టే క్రమంలో నాణ్యతా లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పది రోజుల తర్వాత మళ్లీ దవాఖానను సందర్శిస్తానని తెలిపారు. జిల్లాలో 25 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనులు చేపట్టడం జరుగుతున్నదని, నవాబుపేటలో ఆరోగ్య కేంద్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ వసతి గృహాలను సందర్శిస్తూ విద్యార్థినులకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజల్లో ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ ప్రాథమిక పరీక్షలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా దవాఖానకు వచ్చిన వృద్ధురాలితో మాట్లాడుతూ ఆమె ఆరోగ్యంపై ఆరా తీశారు. ప్రజల్లో ప్రబలుతున్న డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, ఫుడ్ పాయిజన్ వంటి కేసులపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో నిర్వహిస్తున్న ఔట్ పేషంట్, ఏఎంసీ రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు.

అనంతరం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. డార్మెంటరీ, పాఠశాల గదులను సందర్శించిన క్రమంలో విద్యార్థినుల చదువు, ఆరోగ్యం, కంటి సమస్యల గూర్చి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పడక గదులు సరిపడా లేవని విద్యార్థినులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా..ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. సౌకర్యాలకు తగ్గ అంచనాలను సమర్పించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలోలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, తహసీల్దార్ జయరాం, ఎంపీడీవో అనురాధ, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రోహిత్ ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

వికారాబాద్ : వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 14 నవంబర్ నుంచి 10 డిసెంబరు వరకు ప్రతి గ్రామపంచాయతీలో రోజూవారీ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మరుగుదొడ్డి లేనివారు నిర్మించుకోవాలని తెలిపారు. పాఠశాలలు, అంగన్‌వాడీలలో చేపడుతున్న టాయిలెట్ల నిర్మాణాలను డిసెంబర్ చివరి వరకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటరమణ, డీజీడబ్ల్యూవో కృష్ణవేణి, డీపీవో జయసుధ, ఈఈపీఆర్ ఉమేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ మిషన్ భగీరథ ఈఈ చల్మారెడ్డి, డీఎంసీఎస్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

అయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు

ఐడీవోసీ మీటింగ్ హాల్ ఉద్యాన శాఖ అండ్ ఇకో పామ్ అయిల్ అండ్ ఫ్యాట్స్ ప్రైవేట్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో అయిల్ పామ్ పంటల సాగుపై అవగాహన సదస్సు జరిగింది. ఔత్సాహికులైన రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన అధికారి ఎం.ఏ సత్తార్ పంట, నేల, నీరు, పోషకాల ఆవశ్యకత గూర్చి తెలిపారు. అయిల్ పామ్ పంట ఆవశ్యకత, ప్రభుత్వం ఇస్తున్న రాయితీల గూర్చి వివరించారు. డాక్టర్ విజయన్ మాట్లాడుతూ.. ఇండోనేషియాలో వర్షపాతం భారతదేశ వర్షపాతం కంటే రెండున్నర ఇంతలు ఎక్కువ ఉన్నప్పటికీ భారతదేశంలో అయిల్ పామ్ మంచి పెరుగుదల చూపిస్తుందని తెలిపారు. 3-5 సంవత్సరాల్లో మంచి ఆదాయాన్ని ఇస్తుందని చెప్పారు. ఇండోనేషియా రైతులు మాత్రం ధనవంతులుగా మారారని చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ లింగ్యా నాయక్, ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రతిమాసింగ్

ఆమనగల్లు, నవంబర్ 19 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి సౌకర్యాలు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆకస్మికంగా తనిఖీ చేసి, ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు , టార్పాలిన్ కవర్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలిపారు. రైతులు పండించిన ధాన్యం గ్రేడ్-ఏ రకానికి రూ.2320, సాధారణ రకానికి రూ.2300, అదేవిధంగా సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ చెల్లించుటకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులకు ఎలాంటి నష్టం జరుగకుండా ప్రభుత్వ లక్ష్యం ప్రకారం కొనుగోళ్లు జరపాలని సంబంధిత అధికారులకు సూచించారు. ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ట్యాబ్‌లో వెంటనే నమోదు చేసి కేటాయించిన రైస్ మిల్లులకు ధాన్యం తరలించాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో దేవేందర్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్, ఏఈవోలు ఉన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్

ధారూరు, నవంబర్ 19 : ప్రతిఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. మంగళవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని యజ్ఞ ఫౌండేషన్‌లో అనాథ పిల్లలకు స్టాంప్ వెండర్ అశోక్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా శుభప్రద్‌పటేల్ మాట్లాడుతూ.. విద్యార్థులు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, చిన్నప్పటి నుంచే లక్ష్యాలను పెట్టుకొని కష్టపడి చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయుల్లోనే తల్లిదండ్రులను చూసుకోవాలని, యజ్ఞ ఫౌండేషన్‌కు తమ సహాయ సహకారాలు ఎప్పుడూ అందిస్తూనే ఉంటామన్నారు. ఈ సందర్భంగా స్టాంప్ వెండర్ అశోక్‌ను శుభప్రద్‌పటేల్ అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉజ్వల్‌కుమార్, ఉపాధ్యాయులున్నారు.

సీఎం సోదరుడికి రాచమర్యాదలా!

- **ప్రజాప్రతినిధుల అరెస్టు అప్రజాస్వామికం**
- **టీ జేఏసీ వికారాబాద్ జిల్లా చైర్మన్ ముకుంద నాగేశ్వర్**

పరిగి, నవంబర్ 19 : ఎలాంటి రాజ్యాంగ పదవి లేని సీఎం సోదరుడికి రాచమర్యాదలతో స్వాగతాలు పలకడం, ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధుల అడ్డగింతలు, అరెస్టులు అప్రజాస్వామికమని టీ జేఏసీ వికారాబాద్ జిల్లా చైర్మన్ ముకుంద నాగేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూ సేకరణ విషయంలో లగచర్లలో అధికారులపై దాడి దురదృష్టకరమని, ప్రభుత్వ నిఘా వ్యవస్థ లోపం సుస్పష్టమన్నారు. ప్రజలను ఒప్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రైవేటు వ్యక్తులకు, కంపెనీలకు భూమిని ధారాదత్తం చేయడానికి, అసంబద్ధ అవసరానికి మించి భూ సేకరణ రైతుల హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు. ఫార్మా సిటీ పేరిట గత ప్రభుత్వం ముచ్చర్లలో సేకరించిన వేల ఎకరాల భూమిని పూర్తిగా ఉపయోగించుకోకుండా, రైతులకు తిరిగి ఇవ్వకుండా జిల్లాల్లో ఫార్మాసిటీ పేరుతో భూ సేకరణ రైతుల పొట్ట కొట్టడమేనని విమర్శించారు. ఫార్మా ఉత్పత్తులను రెట్టింపు చేసేందుకు ఇప్పుడున్న 600 ఫార్మా కంపెనీలకు ప్రతి కంపెనీకి 5 నుంచి 10 ఎకరాలు కేటాయించినా, కొత్తగా 400 నుంచి 800 కొత్త కంపెనీలకు కేటాయించినా ముచ్చర్ల దగ్గర ఫార్మాసిటీ పేరుతో గత ప్రభుత్వం సేకరించిన భూమి సరిపోవడమే కాకుండా మిగులుతుందని తెలిపారు. కేంద్ర సహకారంతో హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లలో ఏర్పాటు చేస్తున్న బల్క్‌డ్రగ్ పార్కుల వలు తెలంగాణలో సైతం బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రజలచే ఎన్నుకోబడి ప్రజల సంక్షేమ, ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధి కోసం ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయాల్సిన ప్రభుత్వాలు అప్రజాస్వామికంగా వ్యవహరించి ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

సేంద్రియ పద్ధతులను రైతులు అనుసరించాలి

చేవెళ్లటౌన్, నవంబర్ 19 : భూమి సాంద్రతను కాపాడే సేంద్రియ పద్ధతులను రైతులు అనుసరించాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు తెలిపారు.మంగళవారం చేవెళ్లలోని రైతు వేదికలో దృశ్యమాధ్యమం ద్వారా రైతు నేస్తం అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి కోసిన తర్వాత గడ్డిపై స్ప్రే చేస్తే కుళ్లిపోతుందన్నారు. దాన్ని వేస్ట్ డికంపోస్ట్ మిశ్రమంగా తయారుచేయవచ్చన్నారు. గడ్డిని కాల్చడం ద్వారా సల్ఫర్ డై ఆక్సైడ్ విడుదలై వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని, భూమి సారాన్ని కోల్పోతుందని చెప్పారు. అందుకు రైతులు భూ సాంద్రతను కాపాడే సేంద్రియ పద్ధతులను అనుసరించాల్సిందిగా వివరించారు. చలికాలం పత్తి తేమ ఎక్కువగా ఉంటుంది కాబట్టి దానిని ఆరపెట్టుకొని 8-12 శాతం తేమ ఉండేలా చూసుకొని జిన్నింగు మిల్లుకు తీసుకొని వెళ్లి అమ్ముకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ సురేశ్‌బాబు, ఏవో శంకర్ లాల్, ఏఈవోలున్నారు.



ఎస్ఏపీ కళాశాలలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

జిల్లా భూములు సారవంతం

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు, నవంబర్ 19 : వికారాబాద్ జిల్లాలోని భూములు సారవంతమైనవని, మూసీ నది జన్మస్థలం జిల్లా పరిధిలోని అనంతగిరి నీళ్ళు స్వచ్ఛంగా ఉంటాయని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శ్రీఅనంతపద్మనాభ కళాశాలలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హన్మంతరావు వాటర్ కాన్సెప్ట్ -వికారాబాద్‌లో నీటి భద్రత, మూసీనది పునరుజ్జీవంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణం 5,88,476 ఎకరాలు కాగా.. ఇందులో ప్రాజెక్టులు, చెరువులు, బోర్లు బావుల ద్వారా సాగునీటి వసతి ఉన్నదని పేర్కొన్నారు. 1,57,350 ఎకరాలు మినహా మిగతా వర్షాధార పంటలన్నారు. జిల్లాలో మొత్తం 1311 చెరువులు, కుంటలు ఉన్నాయన్నారు. వికారాబాద్ జిల్లాలో సారవంతమైన భూములున్నా సరైన సాగునీటి వసతులు లేవన్నారు. కృష్ణా, గోదావరి నదులు దూరంగా ఉండడంతో సాగునీటిని తీసుకురావడంలో ఇబ్బందులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, ప్రముఖ పర్యావరణవేత్త పురుషోత్తం రెడ్డి, ట్రస్ట్ సభ్యుడు శశిధర్‌రెడ్డి, నాయకుడు డాక్టర్ రాజశేఖర్, రైతులు ఉన్నారు.

బకాయిలుంటే కొనుగోలుకు నో చాన్స్

తిర్మలాపూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైస్‌మిల్‌ను పరిశీలించిన సివిల్ సప్లయ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

కులకచర్ల, నవంబర్ 19: డిఫాల్ట్ సీఎంఆర్ బకాయి ఉన్న రైస్‌మిల్లులకు ధాన్యం కొనుగోలు చేసేందుకు ఆవకాశం లేదని సివిల్ సప్లయ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అన్నారు. మంగళవారం కులకచర్ల మండలంలోని పలు రైస్ మిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యం పెండింగ్‌లో ఉంటే రైస్‌మిల్లులకు ధాన్యం తీసుకునే అవకాశం లేదన్నారు. ఈ సందర్భంగా తొమ్మిది రైస్ మిల్లులను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ శ్రీధర్‌రాజు, డీఎస్‌వో మోహన్‌బాబు, అధికారులు పరంజ్యోతి, సీఈవో బక్కారెడ్డి, సొసైటీ డైరెక్టర్ మొగులయ్య పాల్గొన్నారు.

6 వేల పింఛన్ ఇవ్వాల్సిందే..

- **దివ్యాంగులను మోసం చేసిన సీఎం**
- **వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవర్ధన్**

పెద్దఅంబర్‌పేట, నవంబర్ 19 : దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇస్తానని చెప్పి ఇవ్వకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేశారని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ అన్నారు. తక్షణమే 6 వేలు పింఛన్ అందించాలని కోరుతూ హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ.. ప్రమాణ స్వీకారం చేసిన రోజే దివ్యాంగులకు రూ.6 వేలు పెన్షన్ ఇస్తానని చెప్పి ఏడాది కావొస్తున్నా.. ఏ ఒక్కరికీ ఇవ్వలేదని విమర్శించారు. వృద్ధులు, వితంతువులకు కూడా రూ.4 వేలు పింఛన్ అందించలేదన్నారు. ఈ నెల 26 వరకు పెన్షన్లు అమలు చేయకపోతే మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద దివ్యాంగుల మహాధర్నా చేపడుతామని, అన్ని జిల్లాల నుంచి దివ్యాంగులు తరలిరావాలని కోరినట్టు తెలిపారు. దివ్యాంగుల సదరం స్లాట్లు ఆగిపోయి మూడు నెలలు గడిచినా ప్రభుత్వానికి ఏమాత్రం పట్టింపు లేదని మండిపడ్డారు. తాత్కాలిక సర్టిఫికెట్లు రెన్యువల్ తేదీ ముగిసి, పెన్షన్లు ఆగిపోయి దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ తదితరులు

శిక్షణను శ్రద్ధగా నేర్చుకోవాలి

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

పోలీస్ పరేడ్ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

ధారూరు, నవంబర్ 19 : పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు ట్రైనింగ్ పరేడ్ శిక్షణా కాలంలో ప్రతిఒక్కరూ శ్రద్ధగా నేర్చుకోవాలని వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం వికారాబాద్ పోలీస్ శిక్షణా కేంద్రాన్ని సందర్శించారు. ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణా కాలంలో నేర్చుకునే పరేడ్ సర్వీస్ కాలమంతా పని చేస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీసీ ప్రిన్సిపాల్ మురళీధర్, డీటీసీ డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ వెంకట్‌రామ్, ఆర్ఐ డేవిడ్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలూ అవసరం

- **ప్రొ. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా. శివాజీ**
- **క్రీడామైదానంలో క్రీడలు ప్రారంభం**

వర్సిటీ పరిధిలోని క్రీడామైదానంలో క్రీడల ప్రారంభంలో డా.శివాజీ తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 19 : క్రీడలు విద్యార్థులకు మానసికోల్లాసాన్నిస్తాయని, విద్యతోపాటు క్రీడటూ అవసరమని ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా.శివాజీ అన్నారు. మంగళవారం వర్సిటీ పరిధిలోని క్రీడామైదానంలో క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి చురుకుగా తనకు ఆసక్తి గల పోటీల్లో స్ఫూర్తితో పాల్గొనాలని సూచించారు. పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల మధ్య స్నేహభావం ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. చక్కని ప్రతిభను కనబర్చిన విద్యార్థులు జాతీయ పోటీలకు ఎంపికయ్యే అవకాశం ఉందన్నారు. రాజేంద్రనగర్ కళాశాల డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్ డా.జెల్లా సత్యనారాయణ మాట్లాడుతూ.. క్రీడల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మస్థైర్యం పెంపొందుతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు ముఖ్యం కాదని.. పాల్గొనడం, ప్రతిభను, నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఇది చక్కని వేదిక అన్నారు. డీన్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ డా.విజయలక్ష్మి, అసోసియేట్ డీన్ డా. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు అంకిత భావంతో క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. క్రీడలు క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, సమగ్ర అభివృద్ధికి తోడ్పడుతాయని అన్నారు. సృజనాత్మకతను, ప్రతిభను కనబర్చేందుకు ఇది మంచి అవకాశమని యూనివర్సిటీ అబ్జర్వర్, ఫిజికల్ డిపార్ట్‌మెంట్ హెడ్ డా.సురేశ్ అన్నారు. అంతకు ముందు విద్యార్థులతో ప్రతిజ్ఞ, శాంతి కపోతాలు ఎగురవేసి క్రీడలను ప్రారంభించారు. విశ్వవిద్యాలయం పరిధిలోని ఆయా జిల్లాల 11 కళాశాలల నుంచి విద్యార్థినీ విద్యార్థులు దాదాపు 460 మంది పాల్గొన్నారు. బాలురకు 10, బాలికలకు 9 ఈవెంట్లు జరుగనున్నాయి.

రాష్ట్రస్థాయికి ఎంపికైన యశస్వికి పతకాన్ని అందజేస్తున్న ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు

ముగిసిన మాలఖంబ్ జిల్లాస్థాయి పోటీలు

పెద్దఅంబర్‌పేట, నవంబర్ 19 : మున్సిపాలిటీ పరిధి కుంట్లూరులోని వ్యాస్ మోడల్ స్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన మాలఖంబ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాస్థాయి పోటీలు మంగళవారం ముగిశాయి. పోటీల్లో రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు చెందిన బాలబాలికలు పాల్గొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చెన్న కృష్ణారెడ్డి పతకాలను అందజేశారు. వ్యాస్ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు యశస్వి, యజ్ఞతోపాటు పలువురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా మాలఖంబ్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి ఎస్.గోపాల్, వ్యాస్ మోడల్ స్కూల్ ప్రతినిధులు సర్వేశ్వర్‌రెడ్డి, విశాఖ, శేఖర్, పీఈటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ల నియామకం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా పీసీసీ లీగల్ సెల్ కన్వీనర్లుగా ఎడ్ల భరత్‌రెడ్డి, కొమ్మూరి గాల్‌రెడ్డి, సంతోష్ కుమార్, జిల్లా జాయింట్ కన్వీనర్‌గా పాలకూరి సుధను నియమిస్తూ రంగారెడ్డి జిల్లా చైర్మన్ భిక్షపతి గౌడ్, పీసీసీ లీగల్‌సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్, రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డిని కలుస్తామని తెలిపారు.

హెచ్‌సీయూలో విద్యార్థుల ఆందోళన

కొండాపూర్, నవంబర్ 19 : గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. హాస్టళ్లలో సరైన వసతులు కల్పించకుండా చిన్నపాటి సాకులను చూపుతూ.. వేలల్లో జరిమానాలు విధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న చీఫ్ వార్డెన్ సువాశిస రాణాకు వ్యతిరేకంగా మంగళవారం వర్సిటీ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. చీఫ్ వార్డెన్ ఫ్లయింగ్ స్క్వాడ్ ఇష్టానుసారంగా హాస్టళ్లపై రైడ్‌లు చేస్తున్నారని, అర్ధనగ్నంగా ఉన్న విద్యార్థుల వీడియోలు తీస్తూ, ప్రైవసీకి ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తున్నారన్నారు. హాస్టల్ గదిలో వేడి నీళ్ల కోసం కెటిల్స్ వాడినందుకు ఏకంగా రూ.30వేల జరిమానా విధించారన్నారు. హాస్టల్స్‌లో వేడి నీటి సౌకర్యానికి వసతులు లేవని, మెస్‌లలో సైతం వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సరైన వసతులు కల్పించడంలో విఫలమవుతుండడంతో పాటు విద్యార్థుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్న చీఫ్ వార్డెన్‌ను వెంటనే తొలగించాలంటూ డిమాండ్ చేశారు.

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

మహేశ్వరం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ నారాయణ రెడ్డి

మహేశ్వరం, నవంబర్ 19 : విద్యార్థులు సెల్‌ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. మహేశ్వరం మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ నారాయణరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం తయారు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. మధ్యాహ్న భోజన సిబ్బందితో మాట్లాడారు. వండిన వంటలను ఆయన రుచి చూశారు. మరుగుదొడ్లు, టాయిలెట్స్‌ను ఆయన పరిశీలించారు. రోజుకు రెండు సార్లు స్కావెంజర్లు క్లీన్ చేయాలన్నారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రుల జీవనోపాధి గురించి అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులు కష్ట పడి పాఠశాలలకు పంపిస్తున్నారని గుర్తు చేశారు. తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలంటే బాగా కష్టపడి చదువుకోవాలన్నారు. 15 ఏండ్ల నుంచి 25 ఏండ్ల వరకు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. క్రమశిక్షణ గల విద్యార్థులే జీవితంలో స్థిరపడుతారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో శైలజారెడ్డి, ఎంఈవో నాయక్ ఉన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

బీఈ కోర్సుల పరీక